


PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

ఆదివారం 23 ఆగస్టు 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి:02 సంచిక : 82 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

# తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు లండన్‌లో కీలక ముందడుగు

## విద్య, పరిశోధన, సాంకేతికత, క్రీడలు, పెట్టుబడుల రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యాలకు రేవంత్‌రెడ్డి పర్యటనతో కొత్త ఊపిరి





లండన్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం లండన్ పర్యటనలో భాగంగా కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం, లివర్‌పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగం, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ ప్రతినిధులతో వరుసగా కీలక సమావేశాలు నిర్వహించి తెలంగాణలో విద్య, పరిశోధన, సాంకేతికత, జీవశాస్త్రాలు, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థ, అంకుర సంస్థలు, యువ పారిశ్రామికవేత్తల ఇంక్యుబేషన్ రంగాల్లో అంతర్జాతీయ భాగస్వామ్యాలకు మార్గం సుగమం చేశారు. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ విద్యావేత్తలతో జరిగిన సమావేశంలో హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేసే ప్రభుత్వ లక్ష్యాలను ముఖ్యమంత్రి వివరించగా, కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్లు జైదీప్ ప్రభు, వెంకట సిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. విద్యా కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, యువ పారిశ్రామికవేత్తల ఇంక్యుబేషన్, అంకుర సంస్థల అభివృద్ధికి సహకారంపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని ఇరు వర్గాలు అంగీకరించాయి. లివర్‌పూల్ ప్రతినిధులతో జరిగిన భేటీలో జీవశాస్త్రాలు, సాంకేతికత, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు సంబంధించి తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఆసక్తి వ్యక్తమైంది. ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేసేందుకు లివర్‌పూల్ ప్రతినిధి బృందం అక్టోబర్‌లో హైదరాబాద్‌ను సందర్శించనుంది. ఇదే సమయంలో యూనివర్సిటీ ఆఫ్ లండన్‌లోని సెనేట్ హౌస్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో హైదరాబాద్‌లో యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. వివిధ విద్యా విభాగాలు, పాఠశాలలను అనుసంధానిస్తూ విస్తృత స్థాయిలో విద్యా కోర్సులు, కార్యక్రమాలను అందించేలా క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాల్లో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ అధికారులు కె. రామకృష్ణారావు, జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి లండన్‌లోని చారిత్రక అంబేద్కర్ హౌస్‌ను సందర్శించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 1921–22లో నివసించిన 10 కింగ్ హెన్రీ'స్ రోడ్‌లోని ఈ చారిత్రక భవనాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి, అంబేద్కర్ ఆశయాలు, సామాజిక న్యాయం, సమానత్వం, రాజ్యాంగబద్ధత, కులరహిత సమాజ నిర్మాణం వంటి సిద్ధాంతాలను స్మరించుకున్నారు. అంబేద్కర్ హౌస్‌ను ప్రస్తుతం మ్యూజియంగా ఏర్పాటు చేయగా, యాంటీ కాస్ట్ డిస్క్రిమినేషన్ అలయన్స్ చైర్ సంతోష్ దాస్ ఎంబీఈ మ్యూజియం, డాక్టర్ అంబేద్కర్ జీవితానికి సంబంధించిన అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు. అంబేద్కర్ హౌస్‌ను సందర్శించడం ఆధ్యాత్మిక క్షేత్రాన్ని సందర్శించినట్లుగా ఉందని, సామాజిక న్యాయం కోసం మరింత అంకితభావంతో పనిచేయాలన్న స్ఫూర్తి కలిగిందని ముఖ్యమంత్రి సందర్శకుల డైరీలో పేర్కొన్నారు. తెలంగాణకు ప్రపంచస్థాయి విద్యా సంస్థల భాగస్వామ్యాలు, పరిశోధన అవకాశాలు, పెట్టుబడులు, క్రీడా సహకారం, సాంకేతిక భాగస్వామ్యాలు తీసుకురావడంతో పాటు హైదరాబాద్‌ను అంతర్జాతీయ విద్యా, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దే తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి లండన్ పర్యటన కీలక బలాన్ని చేకూర్చింది.



# చిన్నారుల స్వచ్ఛతా ప్రతిజ్ఞకు సీఎం చంద్రబాబు ప్రశంసలు

అనకాపల్లి, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం అలమండలో నిర్వహించిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో బడి పిల్లలు ప్రదర్శించిన ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో చిన్నారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు తదితరులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. చిన్నారులు ఎంతో ఆత్మవిశ్వాసంతో ప్రజాప్రతినిధులతో ప్రతిజ్ఞ చేయించిన తీరు ప్రశంసనీయంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. స్వచ్ఛతపై విద్యార్థుల్లో ఉన్న అవగాహన, బాధ్యతాభావం అభినందనీయమని తెలిపారు. సమాజంలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. చిన్నారుల చొరవ, ప్రతిభ, స్పష్టమైన సందేశం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# నిజామాబాద్‌లో హైదరాబాద్ తరహా ఇందిరమ్మ ఇండ్ల టవర్స్



నిజామాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: నిజామాబాద్ జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. నిజామాబాద్ టౌన్‌లోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఎమ్మెల్యే సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులకు కేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, మేయర్, హౌసింగ్ బోర్డు ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. గత ప్రభుత్వం నిజామాబాద్ టౌన్‌లో డబుల్ బెడ్రూం ఇళ్లను అసంపూర్తిగా వదిలివేయగా ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేసిందని మంత్రి తెలిపారు. 400 మంది లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపు పత్రాలను అందజేసిన మంత్రి, మరో పది రోజుల్లో మరో 300 మంది లబ్ధిదారులకు ఇళ్లు అందిస్తామని వెల్లడించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులు పూర్తి పారదర్శకంగా, అర్హత ప్రాతిపదికన జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాబోయే 20 రోజుల్లో నిజామాబాద్ టౌన్‌లో పైలట్ ప్రాజెక్ట్ కింద హైదరాబాద్ తరహాలో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 31వ తేదీలోపు వికలాంగులు, వయోవృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు అర్హులైన వారు పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిర్మాణ వ్యయం తగ్గించేందుకు సిమెంట్ బస్తాను రూ.230కే అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, నిజామాబాద్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో 280 మంది సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.3 కోట్ల 72 లక్షల 65 వేల చెక్కును అందజేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నిజామాబాద్ షాపింగ్ కాంప్లెక్స్‌లో గంగస్థాన్ ఫేజ్-2 భవనాన్ని ప్రారంభించిన మంత్రి, ఇంధల్‌వాయి మండలంలో రూ.2.25 కోట్లతో నూతన తహసీల్దార్ కార్యాలయం, రూ.1.40 కోట్లతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.2 కోట్లతో ఆరు అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. రీ-సర్వే జరుగుతున్న గ్రామాల్లో కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, సాదాబైనామా అర్జీల పరిష్కారంలో జాప్యం చేస్తున్న తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేసి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసి వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ సంకల్పమని, కులం, మతం, రాజకీయాలకు అతీతంగా పట్టణం, గ్రామం, గూడెం, తండా అనే తేడా లేకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.



# నిజామాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై మంత్రి పొంగులేటి పరిశీలన

నిజామాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో మార్నింగ్ వాక్ నిర్వహించి, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కలిసి వారికి కానుకలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హైదరాబాద్ తరహాలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు సంబంధించిన ప్రభుత్వ స్థలాలను మంత్రి పరిశీలించారు. పట్టణంలో గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలివేసిన డబుల్ బెడ్రూం ఇళ్లను సైతం పరిశీలించిన మంత్రి, వాటిని వెంటనే నివాసయోగ్యంగా మార్చేందుకు అవసరమైన మౌలిక వసతులు, ఇతర పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పూర్తయిన ఇళ్లను అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి కేటాయించాలని స్పష్టం చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపుల్లో అర్హులైన వారికి ప్రాధాన్యత కల్పిస్తూ పనులను వేగవంతం చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు సూచించారు.



# నిజామాబాద్ నుంచి ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు శ్రీకారం

నిజామాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: నిజామాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించి స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నిర్మాణంలో ఉన్న, ఇప్పటికే పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారుల మనోగతాన్ని తెలుసుకున్నారు. సొంతింటి కల నెరవేరిన ఆనందాన్ని లబ్ధిదారులు మంత్రితో పంచుకుంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. స్వయంగా మంత్రి తమ వద్దకు వచ్చి బాగోగులు తెలుసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారులకు కానుకలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హైదరాబాద్ తరహాలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌ను రాష్ట్రంలోని ఇతర పట్టణాల్లోనూ పేదలు నివసించే ప్రాంతాల్లోనే నిర్మించేందుకు నిజామాబాద్ నుంచి శ్రీకారం చుడుతున్నామని మంత్రి తెలిపారు. ఇందుకోసం నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో గృహనిర్మాణ శాఖకు సంబంధించిన ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. పేదవాడి ఆత్మగౌరవానికి చిహ్నంగా నిలిచే ఇందిరమ్మ ఇళ్లను రాష్ట్రవ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలందరికీ అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రెండు విడతలు, హైదరాబాద్‌లో మొదటి విడత కింద మంజూరు చేసిన ఇళ్లతో కలిపి రాష్ట్రంలో మొత్తం 8 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, ఇందులో 2 లక్షల ఇళ్లు పూర్తయి గృహప్రవేశాలు కూడా పూర్తయ్యాయని తెలిపారు. అనంతరం నిజామాబాద్ పట్టణంలో గత ప్రభుత్వం నిర్మించదలచి అరకొరగా నిర్మించి వదిలేసిన డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయాన్ని మంత్రి పరిశీలించి, నివాసయోగ్యంగా మార్చేందుకు అవసరమైన అన్ని వసతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పూర్తయిన ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి కేటాయించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.




# కాళేశ్వరంపై కుట్రలు మానుకుని రైతులకు నీరందించాలి

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు, ఆరోపణలకు స్వస్తి పలికి రైతులకు సాగునీరు అందించడంపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూఆర్‌పీఎస్) నిర్వహించిన పరీక్షల్లో నాణ్యతకు సంబంధించి సానుకూల నివేదిక వచ్చిన నేపథ్యంలో ఇప్పటివరకు ప్రభుత్వం చేసిన విమర్శలకు సమాధానం చెప్పాలని వారు పేర్కొన్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో కాంక్రీట్ నాణ్యత పరీక్షలు నిర్వహించి ఇచ్చిన ధ్రువీకరణను పరిగణనలోకి తీసుకుని ప్రాజెక్టుపై వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజీలో ఏడో బ్లాకుకు సంబంధించిన సమస్యలను మినహాయించి మిగిలిన బ్లాకుల్లో పెద్దగా నాణ్యతా సమస్యలు లేవని సీడబ్ల్యూఆర్‌పీఎస్ నివేదిక పేర్కొన్నట్లు వారు తెలిపారు. ఇప్పటికే జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నీటిని ఎత్తిపోసేందుకు తాము ఎప్పుడూ వ్యతిరేకం కాదని స్పష్టం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను వినియోగించుకుని రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రెండున్నరేళ్లుగా గోదావరి జలాలను వినియోగించకుండా వృథా చేస్తున్నారని ఆరోపిస్తూ, కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి రైతుల పొలాలకు అందించాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ వివాదాలకు ముగింపు పలికి, అందుబాటులో ఉన్న సాంకేతిక నివేదికలను పరిగణనలోకి తీసుకుని అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి సాగునీటి వినియోగాన్ని పునరుద్ధరించాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు.

# వికసిత్ భారత్ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలి: గోవా సీఎం




విజయవాడ, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: వికసిత్ భారత్–2047 నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ పిలుపునిచ్చారు. భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యంగ్ పొలిటికల్ లీడర్స్ డైలాగ్–2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన యువ రాజకీయ నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. యువత భవిష్యత్‌లో సమర్థవంతమైన విధాన రూపకర్తలు, క్షేత్రస్థాయి నిర్వాహకులు, సాంకేతికతను సమర్థంగా వినియోగించే నాయకులు, సామాజిక వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. రాజకీయ పదవులను లక్ష్యంగా చేసుకోవడం కంటే ప్రజా సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తే వికసిత్ భారత్‌తో పాటు వికసిత్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణం కూడా సాధ్యమవుతుందని ప్రమోద్ సావంత్ విశ్వాసం వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో యువ నాయకత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు.




# దేశ నిర్మాణంలో యువత బాధ్యతతో ముందుకు సాగాలి: ఎంపీ రఘునందన్‌రావు

విజయవాడ, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: యువత భావోద్వేగాలకు లోనుకాకుండా బాధ్యతతో ఆలోచిస్తూ దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. విజయవాడలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ యంగ్ పొలిటికల్ లీడర్స్ డైలాగ్–2026 కార్యక్రమానికి హాజరైన ఆయన యువతను ఉద్దేశించి విస్తృతంగా ప్రసంగించారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే శక్తి యువత చేతుల్లోనే ఉందని, యువత రాజకీయాలు, పాలన, సామాజిక సేవ, దేశాభివృద్ధి అంశాలపై లోతైన అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. రాజకీయాలను కేవలం విమర్శించడానికే పరిమితం కాకుండా దేశ నిర్మాణంలో క్రియాశీల భాగస్వాములుగా మారాలని సూచించారు. ప్రజా సమస్యలను అర్థం చేసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు సమాజంలో మార్పు తీసుకురావడానికి యువత ముందుండాలని ఆకాంక్షించారు. దేశం మనకు ఏమిచ్చిందనే ఆలోచన కంటే దేశానికి మనం ఏమి ఇవ్వగలమనే ఆలోచన ప్రతి యువకుడిలో రావాలని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలకంటే దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చే నాయకత్వాన్ని యువత అలవర్చుకోవాలని, ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకంతో ప్రజల సమస్యలను సమర్థవంతంగా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. యువ రాజకీయ నాయకులు కేవలం పదవుల కోసం కాకుండా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి రావాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పారదర్శకత, జవాబుదారీతనం, నిబద్ధతతో పనిచేయాలని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో మరింత బలమైన, అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతున్న నేపథ్యంలో ఈ ప్రయాణంలో యువత భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. భారత్‌ను విశ్వగురుగా నిలబెట్టే లక్ష్యానికి యువత తమ ప్రతిభ, సాంకేతిక పరిజ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకతను వినియోగించాలని పిలుపునిచ్చారు. దేశ అభివృద్ధి కేవలం ప్రభుత్వాల బాధ్యత కాదని, ప్రతి పౌరుడి భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని పేర్కొంటూ యువత ప్రజా జీవితంలో చురుకైన పాత్ర పోషించాలని కోరారు. విద్య, ఉపాధి, సాంకేతికత, పారిశ్రామిక రంగం, సామాజిక సేవ, ప్రజా పాలన వంటి అన్ని రంగాల్లో యువత కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసే నాయకత్వమే భవిష్యత్తులో అవసరమని అన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న యువత అడిగిన పలు ప్రశ్నలకు ఎంపీ రఘునందన్‌రావు సమాధానాలు ఇచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు. యువతలో రాజకీయ చైతన్యంతో పాటు దేశభక్తి, సామాజిక బాధ్యత, ప్రజాసేవా భావన పెంపొందించడం ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని, యువ నాయకత్వం బలపడితేనే దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత పటిష్ఠంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రులను పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేయాలి మంత్రి దామోదర్ రాజనర్సింహ

## చిన్న సమస్యలకే రోగులను పెద్ద ఆస్పత్రులకు పంపొద్దు.. వారానికి ఒకరోజు ఆకస్మిక తనిఖీలు తప్పనిసరి





హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులను మేజర్ సర్జరీలు సైతం నిర్వహించగలిగే పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని వెంగళ్‌రావునగర్‌లో ఉన్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రుల పనితీరు, వైద్య సేవలు, మౌలిక వసతులు, మానవ వనరులు, వైద్య పరికరాలు, రోగులకు అందుతున్న సేవలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్. చొంగ్తు, అన్ని జిల్లాల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, సంబంధిత అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. టీచింగ్ ఆస్పత్రులతో సమానంగా జిల్లా, ఏరియా ఆస్పత్రుల్లోనూ స్థానిక ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేలా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. టీచింగ్ ఆస్పత్రుల్లో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు జిల్లా, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించామని తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు అవసరమైన మౌలిక వసతులు, పరికరాలు, ఇతర సౌకర్యాలను కూడా అందిస్తున్నామని పేర్కొన్నారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు కూడా రోగులను పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేసి ఇబ్బందులకు గురిచేసే విధానాన్ని మార్చుకోవాలని, సరైన కారణం ఉన్నప్పుడు మాత్రమే రిఫర్ చేయాలని మంత్రి స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పైస్థాయి ఆస్పత్రికి రిఫర్ చేయాల్సి వస్తే ముందుగానే సంబంధిత ఆస్పత్రికి సమాచారం అందించి అక్కడి వైద్యులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా అందించగల వైద్య సేవలను అందించకుండా రోగులను పైస్థాయి ఆస్పత్రులకు పంపడం వల్ల రోగులపై అదనపు ఆర్థిక, ప్రయాణ భారం పడటంతో పాటు టెర్షియరీ ఆస్పత్రులపై అనవసర ఒత్తిడి పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది, పడకలు, పరికరాలు, రోగ నిర్ధారణ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని డీసీహెచ్‌ఎస్‌లను ఆదేశించారు. అవసరం ఉన్న ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొత్త సీటీ స్కాన్లు, ఇతర ఆధునిక రోగ నిర్ధారణ, వైద్య పరికరాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అయితే పరికరాల కోసం ప్రతిపాదనలు పంపేటప్పుడు కేవలం డిమాండ్ చేయకుండా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య, వైద్య సేవల అవసరం, ప్రస్తుతం అందుబాటులో ఉన్న సౌకర్యాలు, పరికరాల వినియోగ సామర్థ్యం తదితర అంశాల ఆధారంగా స్పష్టమైన కారణాలతో ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. డీసీహెచ్‌ఎస్‌లు కార్యాలయాల్లో కూర్చొని నివేదికలు పరిశీలించడం మాత్రమే కాకుండా తమ పరిధిలోని ప్రతి ఆస్పత్రిని వారానికి కనీసం ఒకరోజు ఆకస్మికంగా తనిఖీ చేయాలని మంత్రి స్పష్టం చేశారు. వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతున్నారా, రోగులకు సకాలంలో వైద్యం అందుతోందా, పరికరాలు పనిచేస్తున్నాయా, పరీక్షలు, స్కాన్లు అందుబాటులో ఉన్నాయా, మందుల నిల్వలు ఎలా ఉన్నాయి, ఆస్పత్రిలో పరిశుభ్రత, తాగునీరు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరుగుతోందా అనే అంశాలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించాలని సూచించారు. డీసీహెచ్‌ఎస్‌లు ప్రతి నెలా తమ పనితీరు నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ఆస్పత్రుల్లో విధులకు గైర్హాజరు కావడం, నిర్ణీత సమయానికి ముందే విధుల నుంచి వెళ్లిపోవడం, రోగుల పట్ల నిర్లక్ష్యం వహించడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు గుర్తిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోగులకు అందాల్సిన వైద్య సేవల్లో సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఎలాంటి లోటు రాకుండా సమయపాలన, బాధ్యత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. ఆస్పత్రుల్లో సమస్యలు పెద్దవిగా మారే వరకు వేచి చూడకుండా ముందుగానే గుర్తించి పరిష్కరించాలని సూచించిన మంత్రి, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సమస్యలు, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. స్థానికంగా పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఇతర శాఖల సమన్వయం అవసరమైన అంశాలను సంబంధిత అధికారులతో చర్చించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రతి ఆస్పత్రిని ప్రజలకు నమ్మకమైన వైద్య కేంద్రంగా తీర్చిదిద్దాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.



## తదుపరి చికిత్స కోసం కేరళకు చేరుకున్న పవన్ కళ్యాణ్

కేరళ, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న కుడి భుజానికి తదుపరి చికిత్స కోసం శనివారం సాయంత్రం కేరళ రాష్ట్రానికి చేరుకున్నారు. కొచ్చి విమానాశ్రయానికి చేరుకున్న ఆయన అక్కడి నుంచి త్రిస్సూర్ సమీపంలోని ఆయుర్వేద వైద్యశాలకు నేరుగా బయలుదేరి వెళ్లారు. అక్కడ ప్రత్యేక ఆయుర్వేద థెరపీ ద్వారా కుడి భుజానికి చికిత్స చేయించుకోనున్నట్లు సమాచారం. ఇటీవల శస్త్రచికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు తదుపరి చికిత్సలో భాగంగా పవన్ కళ్యాణ్ కేరళకు వెళ్లినట్లు తెలుస్తోంది. త్రిస్సూర్ సమీపంలోని ఆయుర్వేద వైద్యశాలలో ప్రత్యేక చికిత్సా విధానంలో భాగంగా ఆయనకు అవసరమైన థెరపీ అందించనున్నారు. చికిత్స పూర్తయ్యే వరకు వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకోనున్నట్లు సమాచారం.




## ఏపీ విద్యావ్యవస్థను దేశంలో నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: మంత్రి నారా లోకేష్

విజయనగరం, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: విజయనగరం దాసన్నపేట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన రాష్ట్ర మంత్రి నారా లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థను దేశంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలు పూర్తయ్యాయని, ఇక విద్యార్థులకు నూరుశాతం ఉత్తమ ఫలితాలు అందించడమే అందరి ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా చిన్నారుల ఆలోచనా విధానంలో వస్తున్న మార్పులను ఉపాధ్యాయులు అర్థం చేసుకుని బోధనా పద్ధతులను కూడా అందుకు అనుగుణంగా మార్చుకోవాలని దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి, నైపుణ్యాలను పెంపొందించే విధంగా బోధన సాగాలని, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యారంగ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తూ రాష్ట్ర విద్యావ్యవస్థను మరింత బలోపేతం చేయాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు.

## 90 ఏళ్ల తర్వాత కూడా 1937 నాటి నిర్ణయాన్నే కాంగ్రెస్ పునరావృతం చేసింది: బీజేపీ

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఆలోచనా విధానం ఇప్పటికీ 1937 నాటి నిర్ణయాల వద్దే నిలిచిపోయిందని బీజేపీ విమర్శించింది. 'వందే మాతరం' కేవలం ఒక గీతం కాదని, భారత స్వాతంత్ర్య పోరాటం, దేశభక్తి, కోట్లాది భారతీయుల భావోద్వేగాలకు ప్రతీకగా నిలిచిందని పేర్కొంది. 1937లో కాంగ్రెస్ 'వందే మాతరం' గీతం ఆలాపనకు సంబంధించి పరిమితులు విధించిందని, దాదాపు 90 సంవత్సరాల తర్వాత 2026 ఆగస్టు 19న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అదే నిర్ణయాన్ని మరోసారి పునరుద్ఘాటించిందని బీజేపీ ఆరోపించింది. దేశం, ముఖ్యంగా యువత కొత్త శిఖరాలను అధిరోహిస్తూ ప్రపంచంలో భారత్ తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధిస్తున్న సమయంలో కాంగ్రెస్ మాత్రం పాత రాజకీయ ఆలోచనల నుంచి బయటకు రాలేకపోతోందని విమర్శించింది. దేశంలో తరాలు మారినా, రాజకీయ పరిస్థితులు మారినా కాంగ్రెస్ అనుసరిస్తున్న తుష్టీకరణ రాజకీయాలు మాత్రం మారలేదని బీజేపీ పేర్కొంది. దేశ ప్రయోజనాలను, జాతీయ భావనను అత్యున్నతంగా పరిగణించి రాజకీయాలకు అతీతంగా 'రాష్ట్ర ప్రథమం' అనే సిద్ధాంతంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చింది. 'వందే మాతరం'కు ఉన్న చారిత్రక, జాతీయ ప్రాధాన్యతను యువతకు వివరించడంతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో ఈ గీతం పోషించిన పాత్రను గుర్తుచేసుకోవాలని బీజేపీ సూచించింది. దేశం మారిందని, తరాలు మారాయని, భారత్ ప్రపంచ వేదికపై మరింత శక్తివంతంగా ఎదుగుతున్నప్పటికీ కాంగ్రెస్ మాత్రం 1937 నాటి ఆలోచనా విధానాన్ని కొనసాగిస్తోందంటూ బీజేపీ చేసిన విమర్శలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## వందేమాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరిపై బీజేపీ విమర్శలు

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: జాతీయ గీతం 'వందేమాతరం' విషయంలో కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వైఖరిపై బీజేపీ తీవ్ర విమర్శలు చేసింది. రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ నాయకులు బహిరంగంగా వందేమాతరం ఆలపించబోమని చెబుతున్న నేపథ్యంలో ఈ జాతీయ గీతంపై కాంగ్రెస్‌కు ఎందుకు అభ్యంతరం ఉందనే ప్రశ్న సహజంగానే తలెత్తుతోందని పేర్కొంది. తుష్టీకరణ రాజకీయాల కారణంగానే కాంగ్రెస్ వందేమాతరాన్ని వ్యతిరేకిస్తోందని బీజేపీ ఆరోపించింది. వందేమాతరం గీతంలోని ఆరు చరణాలను లోతుగా పరిశీలిస్తే భారతమాతపై అపారమైన ప్రేమ, భక్తి మాత్రమే వ్యక్తమవుతాయని పేర్కొంది. దేశభక్తి, జాతీయ భావనకు ప్రతీకగా నిలిచిన ఈ గీతం విషయంలో రాజకీయాలకు అతీతంగా గౌరవభావంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని బీజేపీ అభిప్రాయపడింది. అన్ని మతాల ప్రజలు ఆమోదించిన ప్రార్థనలు, జాతీయ భావనను ప్రతిబింబించే గీతాల పట్ల సమాజం విశాల దృక్పథంతో వ్యవహరించిన సందర్భాలను ప్రస్తావిస్తూ, వందేమాతరం విషయంలో భిన్నమైన వైఖరి అవలంబించడం దురదృష్టకరమని పేర్కొంది. వందేమాతరం పాడలేని వారు కనీసం ఆ గీతం ఆలపిస్తున్న సమయంలో గౌరవ సూచకంగా నిలబడాలని బీజేపీ సూచించింది. జాతీయ గౌరవం, దేశభక్తి, భారతమాత పట్ల గౌరవం వంటి అంశాలను రాజకీయాలకు అతీతంగా చూడాలని పిలుపునిచ్చింది.

## ప్రమాదంలో మంచానికే పరిమితమైన కడపకు చెందిన ఒబల్లి సేలంకు ప్రభుత్వ సాయం

కడప, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: ప్రమాదంలో గాయపడి గత ఆరేళ్లుగా మంచానికే పరిమితమైన కడపకు చెందిన ఒబల్లి సేలం పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి, ఆయన ఆరోగ్య పరిస్థితితో పాటు పరిమిత ఆర్థిక వనరులతో జీవిస్తున్న కుటుంబ సంక్షేమంపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు తెలిపారు. ఒబల్లి సేలం పరిస్థితికి సంబంధించిన వీడియోను చూసిన అనంతరం వెంటనే స్పందించిన ఆయన, సేలంకు వికలాంగ పింఛన్‌తో పాటు చట్టప్రకారం అర్హత ఉన్న ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకం, ఇతర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని తన బృందాన్ని ఆదేశించారు. సంబంధిత అధికారులు, సిబ్బంది ద్వారా అవసరమైన వివరాలను సేకరించి అర్హతలను పరిశీలించిన అనంతరం ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయాన్ని త్వరితగతిన అందించాలని సూచించారు. ఆ కుటుంబానికి అవసరమైన అన్ని విధాలుగా సాధ్యమైన సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఆరేళ్లుగా మంచానికే పరిమితమైన సేలం పరిస్థితిపై ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి, అర్హత ఉన్న సంక్షేమ పథకాలు అందించేందుకు చర్యలు ప్రారంభించడంతో కుటుంబ సభ్యుల్లో ఆశాభావం వ్యక్తమవుతోంది.

# సీపీఆర్ శిక్షణతో ప్రాణాలు కాపాడాలి: మెదక్ ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు






మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ (కార్డియోపల్మనరీ రిససిటేషన్) శిక్షణను సద్వినియోగం చేసుకుని విలువైన ప్రాణాలను కాపాడాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. పోలీసులు నిత్యం ప్రజలతో మమేకమై విధులు నిర్వహిస్తారని, ప్రమాదాలు, గుండెపోటు తదితర అత్యవసర పరిస్థితుల్లో సంఘటనా స్థలానికి ఇతరుల కంటే ముందుగా చేరుకునే అవకాశం పోలీసులకు ఎక్కువగా ఉంటుందని, అందువల్ల ప్రతి పోలీసు అధికారి, సిబ్బందికి సీపీఆర్‌పై పూర్తి అవగాహన ఉండటం ఎంతో అవసరమని అన్నారు. యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అధికారులు, సిబ్బందికి సీపీఆర్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య నిపుణులు అత్యవసర సమయంలో సీపీఆర్‌ను ఎప్పుడు, ఎలా చేయాలి, బాధితుడికి ప్రాథమిక ప్రాణరక్షణ చర్యలు ఎలా అందించాలి, సీపీఆర్ నిర్వహించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటనే అంశాలను ప్రాక్టికల్‌గా డెమో ద్వారా వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ గుండెపోటు లేదా ఇతర కారణాలతో వ్యక్తి అకస్మాత్తుగా స్పృహ కోల్పోయి శ్వాస తీసుకోలేని పరిస్థితి ఏర్పడినప్పుడు ఆస్పత్రికి తరలించేలోపు సీపీఆర్ అందించడం అత్యంత కీలకమని తెలిపారు. సకాలంలో, సరైన పద్ధతిలో సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సీపీఆర్ ఎప్పుడు, ఎక్కడ అవసరం వస్తుందో ముందుగా చెప్పలేమని, అందువల్ల ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తప్పనిసరిగా సీపీఆర్‌పై అవగాహన పెంపొందించుకుని అత్యవసర సమయంలో వెంటనే స్పందించేలా సిద్ధంగా ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో ఎక్కడైనా ప్రమాదం లేదా ఇతర అత్యవసర పరిస్థితి ఎదురైతే ఆలస్యం చేయకుండా బాధితుడికి అవసరమైన ప్రాథమిక ప్రాణరక్షణ చర్యలు అందించేలా శిక్షణను ఆచరణలో పెట్టాలని అన్నారు. పోలీసులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, ప్రజలకు కూడా సీపీఆర్ ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పించాలని ఎస్పీ కోరారు. ఒక వ్యక్తి ప్రాణాపాయంలో ఉన్న సమయంలో సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడగలగడం కంటే గొప్ప సేవ మరొకటి ఉండదని, ఈ శిక్షణను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా అవసరమైన సమయంలో ప్రాణాలను రక్షించే నైపుణ్యంగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ సీఐ మహేష్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, యూత్ ఫర్ సేవా ప్రతినిధులు పాల్గొన్నారు.



# క్రమశిక్షణకు పరేడ్ ప్రతీక.. పోలీసుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి: డీఎస్పీ ప్రసన్న కుమార్

మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: పోలీసు శాఖలో క్రమశిక్షణ, సమన్వయం, సమయపాలనకు పరేడ్ ఎంతో కీలకమని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పోలీసు పరేడ్‌కు హాజరైన ఆయన గౌరవ వందనం స్వీకరించి అనంతరం పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధుల్లో నిరంతరం అప్రమత్తంగా ఉండటంతో పాటు సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం ఎంతో అవసరమన్నారు. క్రమం తప్పకుండా పరేడ్‌లో పాల్గొనడం ద్వారా పోలీసు సిబ్బందిలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సమన్వయ భావన పెంపొందుతాయని తెలిపారు. విధి నిర్వహణలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేలా ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలుగుతూ వారి సమస్యలను తెలుసుకుని చట్టపరిధిలో పరిష్కరించేందుకు కృషి చేయాలని అన్నారు. పోలీసు సిబ్బంది ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతిరోజూ వ్యాయామం, పరేడ్ వంటి కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా విధి నిర్వహణలో మరింత సమర్థవంతంగా పనిచేయగలరని పేర్కొన్నారు. అనంతరం పరేడ్‌లో పాల్గొన్న సిబ్బంది కవాతు, డ్రిల్, యూనిఫాం నిర్వహణ, క్రమశిక్షణ, సమన్వయం తదితర అంశాలను డీఎస్పీ పరిశీలించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యానికి ఎలాంటి తావు లేకుండా అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మెదక్ టౌన్ సీఐ మహేష్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ రెండో దశలోనూ సమష్టిగా కృషి చేయాలి: బీజేపీ

మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ అసెంబ్లీ కార్యాలయంలో ఎస్ఐఆర్ రెండో దశ కార్యశాల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కరణం పరిణీత, ఎస్ఐఆర్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి సతీష్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ-2) రెండో దశ ఎస్ఐఆర్ ప్రక్రియలో చేపట్టాల్సిన కార్యాచరణపై సలహాలు, సూచనలు అందించారు. మొదటి దశలో బీఎల్ఏ-2లు సమన్వయంతో, అంకితభావంతో పనిచేయడం వల్ల తెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని, అదే స్ఫూర్తితో రెండో దశలోనూ మరింత కష్టపడి పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు సూచించారు. ఓటర్ల జాబితా సంబంధిత ప్రక్రియలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబంధనల ప్రకారం సమర్థవంతంగా పనిచేయాలని బీఎల్ఏ-2లకు దిశానిర్దేశం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ ఎస్ఐఆర్ రెండో దశను విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసని సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మాజీ ఓబీసీ మోర్చా నాయకుడు రమేష్ గౌడ్, రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అశోక్, సాదుల బిక్షపతి, జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు గుండం శంకర్, సుభాష్ గౌడ్, మండల అధ్యక్షులు నాగ ప్రభు గౌడ్, పెద్దపులి రవి, హరీష్, నాగేందర్ రెడ్డి, బీఎల్ఏ-2లు, మండల నాయకులు, సర్పంచులు నాగభూషణం, మల్లేశం, కుమార్, ఉపసర్పంచ్ నరేష్, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌వీ మార్ట్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి




సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలో యూనియన్ బ్యాంక్ ఎదురుగా కోట నరేష్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌వీ మార్ట్‌ను మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో నూతన వ్యాపార సంస్థలు ఏర్పాటవడం స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు, అవసరమైన వస్తువులు అందుబాటులోకి రావడానికి దోహదపడతాయని అన్నారు. నూతనంగా ప్రారంభమైన ఎస్‌వీ మార్ట్ నిర్వాహకులు ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ వ్యాపారంలో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), మాజీ కౌన్సిలర్, న్యాయవాది అల్లే శ్రీకాంత్, కోట సాయిబాబా, గజవాడ రాజేశ్వర్, బీపేట సంపత్ కుమార్, పోల రఘునాథ్, కోవూరి విజయ్ కుమార్, పురం రఘు, గంగోత్రి శ్రీనివాస్, గాజుల పవన్ కుమార్, గొర్లకాడి కుమార్‌తో పాటు ఇతర ప్రముఖులు, కుటుంబ సభ్యులు, స్థానిక పెద్దలు పాల్గొని నూతన మార్ట్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.




# గోమారంలో ఉద్రిక్తత.. ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన

మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: శివంపేట మండలం గోమారం గ్రామంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద విద్యార్థులు మరోసారి ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కళాశాలకు చెందిన విద్యార్థులు యూనిఫాంలో కళాశాల ఎదుట బైఠాయించి తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకొచ్చిన శక్తి స్కీమ్‌ను వెంటనే తొలగించాలని, పాలిటెక్నిక్ కళాశాలలను పూర్తిగా స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌బీటీఈటీ) ఆధ్వర్యంలోనే కొనసాగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97 వల్ల పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థ నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు, విద్యా ప్రమాణాలు, కళాశాలల నిర్వహణకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరుతూ విద్యార్థులు నినాదాలు చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు.







# జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రి ల్యాబ్‌లో రక్త పరీక్షలపై సందేహాలు

జోగిపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: జోగిపేట 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలోని ల్యాబ్‌లో రక్త పరీక్షల నిర్వహణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వైద్యులు సూచించిన రక్త పరీక్షల కోసం చీటీ తీసుకుని ల్యాబ్‌కు వెళ్లిన రోగికి అక్కడ పరీక్షలు చేయడం సాధ్యం కాదని, ప్రైవేట్ ల్యాబ్‌లో పరీక్షలు చేయించుకోవాలని లేదా సంగారెడ్డికి వెళ్లాలని ల్యాబ్ సిబ్బంది సూచించినట్లు సమాచారం. ఈ విషయాన్ని సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ వి. వెంకటేశం ఆసుపత్రి రామ్‌ఓ అశోక్ దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లగా, అక్కడే ఉండాలని, ల్యాబ్ టెక్నీషియన్‌తో మాట్లాడతానని ఆయన తెలిపినట్లు పేర్కొన్నారు. అనంతరం కొద్దిసేపటికే ల్యాబ్ సిబ్బంది తిరిగి పిలిచి అదే ఆసుపత్రిలో రక్త పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. తొలుత పరీక్షలు చేయలేమని చెప్పి, కొద్దిసేపటికే అదే ల్యాబ్‌లో పరీక్షలు ఎలా నిర్వహించారని ప్రశ్నించగా, మిషన్‌లో లేజర్ సమస్య ఏర్పడిందని, ప్రస్తుతం సమస్య పరిష్కారమైందని ల్యాబ్ సిబ్బంది సమాధానం ఇచ్చినట్లు వెంకటేశం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు ప్రధానంగా పేద, మధ్యతరగతి ప్రజలు వైద్యం కోసం వస్తుంటారని, అక్కడ అందుబాటులో ఉండాల్సిన రక్త పరీక్షలు నిర్వహించలేక ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాలని సూచిస్తే రోగులపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఒక జర్నలిస్టు అధికారులను సంప్రదించిన అనంతరం అదే ఆసుపత్రి ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించగా, అధికారులను ప్రశ్నించే పరిస్థితి లేని సామాన్య రోగుల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ల్యాబ్ యంత్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు రోగులకు వాస్తవ పరిస్థితిని స్పష్టంగా తెలియజేయడంతో పాటు, అవసరమైన పరీక్షలు ప్రభుత్వ పరిధిలోనే అందుబాటులో ఉండేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రి ల్యాబ్‌లో సేవల నిర్వహణ, పరికరాల పనితీరుపై ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించి, భవిష్యత్తులో రోగులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# హాస్టల్ నిర్వాహకురాలు కనిపించకపోవడంతో 120 మంది విద్యార్థులు రోడ్డున



నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని తుప్రాన్ రోడ్డులో శ్రీ వెంకటేశ్వర కాలనీలో ప్రైవేట్ హాస్టల్ నిర్వహిస్తున్న సాయి మణి అనే మహిళ గత మూడు రోజులుగా విద్యార్థులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అందుబాటులో లేకపోవడంతో హాస్టల్‌లో ఉంటున్న సుమారు 120 మంది విద్యార్థులు దిక్కుతోచని పరిస్థితిలో పడినట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం సాయి మణి కాలనీలో ఇళ్లను అద్దెకు తీసుకుని బాలికలకు, బాలురకు వేర్వేరుగా హాస్టళ్లు నిర్వహిస్తూ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఇంటర్, డిగ్రీ తదితర కోర్సులు చదువుతున్న సుమారు 120 మంది విద్యార్థులకు వసతి కల్పిస్తున్నారు. హాస్టల్‌లో చేరే సమయంలో విద్యార్థులు రెండు నుంచి నాలుగు నెలలకు సంబంధించిన ఫీజులను ముందుగానే అడ్వాన్స్‌గా చెల్లించినట్లు చెబుతున్నారు. అయితే గత మూడు రోజులుగా హాస్టల్ నిర్వాహకురాలు అకస్మాత్తుగా అందుబాటులో లేకపోవడంతో భోజనం, ఇతర వసతి సౌకర్యాలు నిలిచిపోయి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులుగా బయట హోటళ్లలో భోజనం చేస్తూ అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని, ఇంటి నుంచి తెచ్చుకున్న డబ్బులు కూడా ఖర్చైపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని విద్యార్థులు తెలిపారు. ఇదిలా ఉండగా హాస్టల్ నిర్వాహకురాలికి ఇళ్లు అద్దెకు ఇచ్చిన యజమానులకు సుమారు రూ.12 లక్షల వరకు అద్దె బకాయిలు ఉన్నట్లు, కిరాణా దుకాణాల నిర్వాహకులకు సుమారు రూ.8 లక్షల వరకు బకాయిలు ఉన్నట్లు, పలువురు ప్రైవేట్ ఫైనాన్స్ నిర్వాహకుల వద్ద కూడా భారీగా అప్పులు చేసినట్లు సమాచారం. ఇల్లు అద్దె, కిరాణా సరుకుల బకాయిలు, ప్రైవేట్ ఫైనాన్స్ అప్పులు తదితరాలు కలిపి దాదాపు రూ.30 లక్షల వరకు అప్పులు ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఈ ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన పూర్తి వాస్తవాలు అధికారుల సమగ్ర విచారణలో తేలాల్సి ఉంది. నిర్వాహకురాలు అందుబాటులో లేకపోవడంతో హాస్టల్‌లో ఉండాలో, సొంత ఇళ్లకు వెళ్లాలో తెలియక విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. సొంత ఇళ్లకు వెళ్లిపోతే కళాశాలకు హాజరుకావడం కష్టమవుతుందని, హాస్టల్‌లో ఉంటే భోజనం, వసతి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ముందుగానే హాస్టల్ ఫీజులు, అడ్వాన్స్‌లు చెల్లించామని, ఇప్పుడు నిర్వాహకురాలు అందుబాటులో లేకపోవడంతో తమ డబ్బులు, వసతి పరిస్థితిపై తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. "మూడు రోజులుగా తినడానికి కూడా ఇబ్బందులు పడుతున్నాం.. ఎటు వెళ్లాలో తెలియడం లేదు.. ఇంటి నుంచి తెచ్చుకున్న డబ్బులు కూడా అయిపోయాయి. సొంత ఇళ్లకు వెళ్తే కళాశాలకు వెళ్లలేం. మా చదువులు నష్టపోకుండా అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలి" అంటూ విద్యార్థులు వేడుకుంటున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి హాస్టల్ నిర్వాహకురాలి ఆచూకీ, హాస్టల్ నిర్వహణ, విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులు, అద్దె బకాయిలు, ఇతర ఆర్థిక లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని విద్యార్థులు కోరుతున్నారు. అంతేకాకుండా విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా తాత్కాలికంగా ప్రత్యామ్నాయ వసతి, భోజన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థులు ముందుగా చెల్లించిన అడ్వాన్స్‌లు, ఇతర బకాయిల విషయంలో న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



## ఎస్ఐఆర్ రెండో దశ విజయవంతానికి సమష్టి కృషి చేయాలి: బీజేపీ

మెదక్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో నర్సాపూర్ అసెంబ్లీ కార్యాలయంలో ఎస్ఐఆర్ రెండో దశ కార్యశాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కరణం పరిణీత, ఎస్ఐఆర్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి సతీష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై బీఎల్ఏ-2లకు రెండో దశ ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన విధివిధానాలు, చేపట్టాల్సిన కార్యాచరణ, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మొదటి దశలో బీఎల్ఏ-2లు సమష్టిగా, సమర్థవంతంగా పనిచేయడం వల్ల తెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని, అదే స్ఫూర్తితో రెండో దశలోనూ మరింత అంకితభావంతో పనిచేసి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన ప్రక్రియలో ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబంధనల ప్రకారం బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని బీఎల్ఏ-2లకు దిశానిర్దేశం చేశారు. మండల స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏ-2లు సమన్వయంతో పనిచేసి ఎస్ఐఆర్ రెండో దశను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగసని సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మాజీ ఓబీసీ మోర్చా నాయకుడు రమేష్ గౌడ్, రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు అశోక్, సాదుల బిక్షపతి, జిల్లా కోశాధికారి ఆంజనేయులు గౌడ్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు గుండం శంకర్, సుభాష్ గౌడ్, మండల అధ్యక్షులు నాగ ప్రభు గౌడ్, పెద్దపులి రవి, హరీష్, నాగేందర్ రెడ్డి, బీఎల్ఏ-2లు, మండల నాయకులు, సర్పంచులు నాగభూషణం, మల్లేశం, కుమార్, ఉపసర్పంచ్ నరేష్, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తాం: ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని పలు రేషన్ దుకాణాల్లో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, రేషన్ కార్డుల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు అవసరమైన నిత్యావసర సరుకులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను ప్రభుత్వం కొనసాగిస్తోందని, ఎవరైనా అర్హత ఉన్నప్పటికీ రేషన్ కార్డు పొందలేకపోతే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కౌన్సిలర్ సుధీర్, పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నగేష్, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆధ్వర్యంలోని రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సాపూర్ పట్టణంలోని శ్రీ సాయి కృష్ణ గార్డెన్స్‌లో పుష్పగిరి రెటినా ఇన్‌స్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి నర్సాపూర్ పట్టణం, పరిసర ప్రాంతాల నుంచి దాదాపు 600 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు నిర్వహించిన పరీక్షల్లో ఆపరేషన్ అవసరమైన వారికి నాలుగు నుంచి ఐదు రోజుల్లో ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు, కళ్లద్దాలు అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేస్తామని నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఉచిత వైద్య శిబిరాల ద్వారా అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కంటి పరీక్షల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో శిబిరం సందడిగా మారింది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాజన్న ఫౌండేషన్ ప్రతినిధులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ కార్మికుల ఐక్యతకు మజ్దూర్ యూనియన్ బలోపేతం

నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మెదక్ జిల్లా నర్సాపూర్ డిపోకు చెందిన ఉద్యోగులు సమిష్టిగా తెలంగాణ మజ్దూర్ యూనియన్‌కు మద్దతు ప్రకటించి, ఒకే యూనియన్‌గా ఏర్పడి అశ్వత్థామ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డిని యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే దిశగా ప్రభుత్వం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ మజ్దూర్ యూనియన్ నాయకుడు అశ్వత్థామ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయన నాయకత్వంలో కార్మికులకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలను ఐక్యంగా ముందుకు తీసుకెళ్లేందుకు యూనియన్ బలోపేతం కావాల్సిన అవసరం ఉందని, ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, భద్రత, భవిష్యత్ ప్రయోజనాల కోసం సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమం డిపో కార్యదర్శి కె. వెంకట్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించగా డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, ముఖ్య సలహాదారు మాందాపురం శ్రీనివాస్, మెదక్ రీజియన్ ఇన్‌చార్జి మేడి రాధాకృష్ణన్ రావు, రాష్ట్ర నాయకులు మాటూరి శాఖయ్య, అశ్వాక్ అహ్మద్, సుబ్బారావు, నర్సాపూర్ డిపో అధ్యక్షుడు నాగరాజు గౌడ్, రామాంజనేయులు, ప్రేమ్ కుమార్, శ్రీధర్ గౌడ్, శివకుమార్, ఎం. గోపాల్, బిక్షపతి, జమీల్ మియా, వీరేశలింగం తదితరులు పాల్గొన్నారు.



## వరికి ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు అధిక ఆదాయం: వ్యవసాయ అధికారులు

నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని లింగాపూర్ రైతు వేదికలో వరి పంట నుంచి ప్రత్యామ్నాయ పంటల వైపు పంటల వైవిధ్యీకరణపై రెండో రోజు సహచర అభ్యాస శిక్షణ కార్యక్రమం (ఆర్‌పీఎల్–రికగ్నిషన్ పీర్ లెర్నింగ్) వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీఆర్‌వీకే హెడ్, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ రైతులకు పంటల వైవిధ్యీకరణ ప్రాముఖ్యత, వరికి ప్రత్యామ్నాయంగా అనువైన పంటలు, పంట మార్పిడి విధానం, నీటి వినియోగాన్ని తగ్గించడం, నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, రైతుల ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలపై శాస్త్రీయ అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి ఎం. దీపిక మాట్లాడుతూ రైతులు తమ భూమి స్వభావం, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ డిమాండ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని వరితో పాటు ప్రాంతానికి అనుకూలమైన ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా నీటి వనరులను సంరక్షించడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, పంటలపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించుకుని రైతులు స్థిరమైన ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. శిక్షణలో భాగంగా రైతుల్లో అవగాహన స్థాయిలో వచ్చిన మార్పును తెలుసుకునేందుకు పోస్ట్ ఎవాల్యుయేషన్ నిర్వహించి, శిక్షణకు ముందు, అనంతరం రైతుల అవగాహన స్థాయిని అంచనా వేసి ఫలితాలను నమోదు చేశారు. అనంతరం శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన రైతులకు శిక్షణ పూర్తి చేసిన ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ శిక్షణ ద్వారా ప్రత్యామ్నాయ పంటల సాగు, పంట మార్పిడి, పంటల వైవిధ్యీకరణ, నీటి పొదుపు, నేల ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై మెరుగైన అవగాహన పొందామని తెలిపారు. రైతులు శిక్షణలో పొందిన జ్ఞానాన్ని తమ పొలాల్లో ఆచరణలో పెట్టి, స్థానిక వాతావరణం, నేల పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణమైన ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు దుర్గాప్రసాద్, రాజశేఖర్, ఏటీఎం హరీష్, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి: న్యాయమూర్తి ఎం. హేమలత




నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసి, రాజీకి అవకాశం ఉన్న కేసులను సత్వర పరిష్కారం చేసుకునేలా కక్షిదారులకు సహకరించాలని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ న్యాయమూర్తి ఎం. హేమలత పోలీసు అధికారులకు సూచించారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, మెదక్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు నర్సాపూర్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ ఏర్పాట్లు, కేసుల పరిష్కారంపై పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎం. హేమలత మాట్లాడుతూ రాజీ చేయదగిన కేసుల్లో కక్షిదారులు పరస్పర అంగీకారంతో సమస్యలను పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్‌అదాలత్ ఒక మంచి అవకాశమని తెలిపారు. లోక్‌అదాలత్ ద్వారా కేసులను సత్వరంగా పరిష్కరించుకోవడంతో సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరుపక్షాలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. నర్సాపూర్ కోర్టు పరిధిలోని పోలీసు అధికారులు రాజీకి అవకాశం ఉన్న కేసుల వివరాలను పరిశీలించి, సంబంధిత కక్షిదారులకు జాతీయ లోక్‌అదాలత్ ప్రయోజనాలను వివరించి కేసుల పరిష్కారానికి సంపూర్ణ సహకారం అందించాలని సూచించారు. కక్షిదారులు సెప్టెంబర్ 12న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకుని తమ కేసులను సత్వర పరిష్కారం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నర్సాపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రంగాకృష్ణ, నర్సాపూర్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రంజిత్ రెడ్డి, చిలప్‌చెడ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నర్సింలు, నర్సాపూర్ ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ రాఘువేందర్ రావు, కౌడిపల్లి డబ్ల్యూఏఎస్ఐ అండాలు, పోలీసు కోర్టు కానిస్టేబుళ్లు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీవీఆర్ఐటీలో ఘనంగా చంద్రప్రస్థాన్–2026 వేడుకలు




మెదక్ జిల్లా నర్సాపూర్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సాపూర్‌లోని బి.వి. రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో మూడో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని 'చంద్రప్రస్థాన్–2026' పేరుతో రెండు రోజులపాటు సాంకేతిక, విజ్ఞాన ఆధారిత కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో అంతరిక్ష సాంకేతికత, ఎంబెడెడ్ సిస్టమ్స్, గ్రహాల అన్వేషణ, భూ వ్యవస్థల శాస్త్రం వంటి ఆధునిక రంగాలపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బేసిక్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్, ఎస్ఈడీఎస్ లాంచ్‌ప్యాడ్ 404 స్టూడెంట్ స్పేస్ క్లబ్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారతదేశం అంతరిక్ష పరిశోధన రంగంలో సాధించిన విజయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు అభివృద్ధి చెందుతున్న అంతరిక్ష సాంకేతిక రంగాల్లో వినూత్న పరిష్కారాలను రూపొందించే దిశగా వారిని ప్రోత్సహించారు. చంద్రప్రస్థాన్–2026లో భాగంగా సాంకేతిక క్విజ్‌లు, విజువల్ ఛాలెంజ్‌లు, ESP32 ఆధారంగా స్వయంప్రేరిత గ్రహ ల్యాండర్ పేలోడ్ ప్రోటోటైపింగ్ ఛాలెంజ్ తదితర కార్యక్రమాలను నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా తరగతి గదిలో నేర్చుకున్న సైద్ధాంతిక పరిజ్ఞానాన్ని ప్రాక్టికల్ సమస్యల పరిష్కారంలో వినియోగించే అవకాశం విద్యార్థులకు లభించడంతో పాటు గ్రహాల అన్వేషణలో ఎదురయ్యే సాంకేతిక సవాళ్లపై అవగాహన పెంపొందింది. కార్యక్రమం రెండో రోజు హైదరాబాద్‌కు చెందిన INCOIS శాస్త్రవేత్త-ఎఫ్ డా. వెంకట్ శేషు రెడ్డెం "సముద్రాలు, వాతావరణం మరియు జీవం మధ్య ఉన్న పరస్పర సంబంధాలు" అనే అంశంపై నిపుణుల ఉపన్యాసం అందించారు. సముద్ర పరిశీలన, వాతావరణ అధ్యయనాలు, సముద్ర జీవావరణ వ్యవస్థలు, భూ వ్యవస్థల పర్యవేక్షణకు అవసరమైన ఆధునిక సాంకేతికతల ప్రాముఖ్యతను ఆయన వివరించడంతో పాటు భూమిపై ఉన్న సహజ వ్యవస్థలను అర్థం చేసుకోవడం, వాటిని పరిరక్షించడం, శాస్త్రీయ పరిశోధనను ముందుకు తీసుకెళ్లడంలో సాంకేతిక ఆవిష్కరణల పాత్రపై విద్యార్థులకు విలువైన అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నిపుణులతో తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. తద్వారా భూ, పర్యావరణ శాస్త్రాల్లో జరుగుతున్న సమకాలీన పరిశోధనలు, అభివృద్ధులపై మరింత అవగాహన పొందారు. కార్యక్రమం ముగింపులో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేయడంతో పాటు ముఖ్య అతిథిని ఘనంగా సత్కరించారు. చంద్రప్రస్థాన్–2026 కార్యక్రమం విద్యార్థులకు అంతరిక్ష శాస్త్రం, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, శాస్త్రీయ ఆవిష్కరణలు, అంతరశాఖ పరిశోధనలపై అవగాహన పెంపొందించుకునేందుకు సమర్థవంతమైన వేదికగా నిలిచింది. విద్యార్థులకు శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో పరస్పర చర్య చేసే అవకాశాలను కల్పిస్తూ అనుభవపూర్వక అభ్యసన కార్యక్రమాలను ప్రోత్సహించడం ద్వారా భవిష్యత్ ఆవిష్కర్తలు, అంతరిక్ష రంగ నిపుణులను తీర్చిదిద్దేందుకు బీవీఆర్ఐటీ తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా. బి.ఆర్. సంజీవ రెడ్డితో పాటు అన్ని విభాగాల అధిపతులు, డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఇంజినీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ బి. బాపి రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ కూడా పాల్గొని కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించారు. విద్యార్థుల్లో అంతరిక్ష విద్య, శాస్త్రీయ ఆలోచన, సాంకేతిక నైపుణ్యాలు, ఆవిష్కరణలు, అనుభవపూర్వక అభ్యసనం, అంతరశాఖ సహకారాన్ని పెంపొందించేందుకు బీవీఆర్ఐటీ చేస్తున్న కృషికి చంద్రప్రస్థాన్–2026 మరో విజయవంతమైన ఉదాహరణగా నిలిచింది.



# గురజాల పాపారావు దశదినకర్మకు మండల నాయకుల హాజరు

చింతకాని మండలం, సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్, ఆగస్టు 22: చింతకాని మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన గురజాల పాపారావు ఇటీవల అకాల మరణం చెందగా, ఆయన దశదినకర్మ కార్యక్రమాన్ని శనివారం లచ్చగూడెం గ్రామంలో కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతకాని మండలానికి చెందిన పలువురు నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు కార్యక్రమానికి హాజరై గురజాల పాపారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పాపారావు మృతి ఆయన కుటుంబ సభ్యులతో పాటు గ్రామానికి తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చింతకాని మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంకెన రమేష్, బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి బొడ్డు రామారావు, మాజీ ఎంపీపీ గురజాల హనుమంతరావు, తిరుమలాపురం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, కోమట్లగూడెం గ్రామ సర్పంచ్ కొండూరు పరిశుద్ధరావు, సొసైటీ డైరెక్టర్ ప్రసాద్, బండి రామారావు, చాపలమడుగు నరేష్, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




# ఉత్తమ గ్రామ సర్పంచ్‌గా బండారి లక్ష్మి

కోహెడ, సందేశం టైమ్స్ ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ వి. వెంకటేశం, ఆగస్టు 23: సిద్ధిపేట జిల్లా కోహెడ మండలం కూరెల్ల గ్రామ సర్పంచ్ బండారి లక్ష్మి బాలరాజు ఉత్తమ గ్రామ సర్పంచ్‌గా పురస్కారం అందుకున్నారు. గ్రామ అభివృద్ధికి చేస్తున్న కృషి, ప్రజలకు మౌలిక వసతుల కల్పన, గ్రామ సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను గుర్తించిన అధికారులు ఆమెను ఉత్తమ గ్రామ సర్పంచ్ పురస్కారానికి ఎంపిక చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క చేతుల మీదుగా, మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో బండారి లక్ష్మి పురస్కారాన్ని అందుకున్నారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు గ్రామంలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కడం పట్ల కూరెల్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఉత్తమ గ్రామ సర్పంచ్‌గా పురస్కారం అందుకున్న బండారి లక్ష్మి బాలరాజు దంపతులను గ్రామ ప్రజలు, స్థానికులు అభినందించి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.



# జిల్లాలో 3,340 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్ నియోజకవర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: మెదక్ జిల్లాలో ఎరువుల కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. జిల్లాలో ప్రస్తుతం 3,340 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ప్రతిరోజూ మండలాల వారీగా 1,000 నుంచి 1,500 బ్యాగుల వరకు ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. గత ఖరీఫ్ సీజన్‌లో 2025 ఆగస్టు వరకు 20,758 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేయగా, ప్రస్తుత ఖరీఫ్ 2026లో ఆగస్టు వరకు ఇప్పటికే 19,045 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేసినట్లు వివరించారు. జిల్లాలో ఎరువుల సరఫరా, విక్రయాలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ఆగస్టు 7, 2026 నుంచి ఎఫ్ఎస్ఎస్ (FSS–ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్) యాప్‌ను ప్రారంభించామని, ఈ యాప్ ద్వారా రైతులు ఎరువులను బుక్ చేసుకునే విధానం అమల్లోకి వచ్చిందన్నారు. కొత్తగా ప్రారంభించిన యాప్‌లో తొలుత కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తినప్పటికీ వాటిని గుర్తించి పరిష్కరించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మొదట్లో రైతులు జిల్లాలో ఎక్కడైనా ఎరువులు కొనుగోలు చేసుకునే విధంగా అవకాశం కల్పించామని, అయితే ఇతర మండలాలకు వెళ్లాల్సి రావడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గత రెండు రోజులుగా డివిజన్ వారీగా ఎరువులు అందించే విధంగా యాప్‌ను అనుగుణంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. రైతులు తమ సొంత మండలంతో పాటు అవసరమైన సందర్భంలో ఇతర మండలాల్లో కూడా ఎరువులు కొనుగోలు చేసుకునే విధంగా వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. అందుబాటులో ఉన్న ఎరువుల పరిమాణం కంటే ఎక్కువగా రైతులు ఒకేసారి బుకింగ్ చేయడం వల్ల యాప్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నట్లు గుర్తించామని, ఈ అంశంపై కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌కు నివేదిక పంపడంతో పాటు సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించే చర్యలు కొనసాగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. రైతులు తమ అవసరాలకు మించి ఎరువులను కొనుగోలు చేయడం వల్ల అవసరమైన ఇతర రైతులకు ఎరువులు అందక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ప్రతి రైతు తన పంటకు అవసరమైన మేరకే ఎరువులను యాప్ ద్వారా బుక్ చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు అందించే సలహాలు, సూచనలను రైతులు పాటిస్తూ అందుబాటులో ఉన్న ఎరువులను సమన్వయంతో వినియోగించుకోవాలని, ఎరువుల సరఫరాపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ ప్రతిమా సింగ్ రైతులకు విజ్ఞప్తి చేశారు.

# టీచింగ్ హాస్పిటళ్లతో సమానంగా జిల్లా, ఏరియా ఆసుపత్రుల అభివృద్ధి: మంత్రి దామోదర్ రాజనర్సింహ





సంగారెడ్డి, సందేశం టైమ్స్ సంగారెడ్డి ఇన్‌చార్జి కే. సంగమేశ్వర్, ఆగస్టు 23: రాష్ట్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా, డిస్ట్రిక్ట్ హాస్పిటళ్లను మేజర్ సర్జరీలు నిర్వహించగలిగే పూర్తిస్థాయి వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. టీచింగ్ హాస్పిటళ్లతో సమానంగా స్థానికంగానే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే సామర్థ్యం జిల్లా, ఏరియా ఆసుపత్రులకు ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, వైద్య సేవలు, మౌలిక వసతులు, మానవ వనరులు, వైద్య పరికరాలపై మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, అన్ని జిల్లాల డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు కూడా రోగులను పెద్ద ఆసుపత్రులకు అనవసరంగా రిఫర్ చేసే విధానాన్ని వెంటనే మార్చాలని హెచ్చరించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించకుండా రోగులను గాంధీ, ఉస్మానియా వంటి పైస్థాయి ఆసుపత్రులకు పంపడం వల్ల రోగులపై అదనపు ఆర్థిక భారం పడటంతో పాటు టెర్షియరీ ఆసుపత్రులపై అనవసర ఒత్తిడి పెరుగుతుందని పేర్కొన్నారు. సరైన వైద్య కారణం లేకుండా రోగులను రిఫర్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసిన మంత్రి, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే మరో ఆసుపత్రికి రిఫర్ చేయాలని, అలా పంపాల్సి వస్తే ముందుగానే సంబంధిత ఆసుపత్రి వైద్యులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. డీసీహెచ్ఎస్‌లు కార్యాలయాలకే పరిమితం కాకుండా తమ పరిధిలోని ప్రతి ఆసుపత్రిని వారానికి కనీసం ఒకసారి ఆకస్మికంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది సమయానికి విధులకు హాజరవుతున్నారా, రోగులకు సకాలంలో వైద్యం అందుతోందా, బెడ్లు, మందులు, పరికరాలు, పరీక్షలు, స్కానింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయా, ఆసుపత్రుల్లో పరిశుభ్రత, తాగునీరు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరుగుతోందా అనే అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతి నెలా పనితీరు నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. విధులకు గైర్హాజరు కావడం, నిర్ణీత సమయం కంటే ముందే ఆసుపత్రి నుంచి వెళ్లిపోవడం, విధుల్లో నిర్లక్ష్యం వహించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని, అలాంటి ఘటనలు గుర్తిస్తే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరం ఉన్న ఆసుపత్రుల్లో కొత్త సీటీ స్కాన్లు, ఇతర వైద్య, డయాగ్నస్టిక్ పరికరాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, పరికరాల అవసరాన్ని రోగుల సంఖ్య, వైద్య సేవల అవసరం, వినియోగ సామర్థ్యం తదితర అంశాలతో స్పష్టమైన జస్టిఫికేషన్‌తో సమర్పించాలని తెలిపారు. ఆసుపత్రుల్లో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలను ముందుగానే గుర్తించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఇప్పటికే టీచింగ్ హాస్పిటళ్లలో 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు జిల్లా, ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో 1,616 మంది స్పెషలిస్ట్ వైద్యులను నియమించామని మంత్రి తెలిపారు. అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది, మౌలిక వసతులు, పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని పేద, సామాన్య ప్రజలకు స్థానికంగానే నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు.

# ఒక్కడే.. 60కిపైగా చోరీ కేసుల్లో నిందితుడు! తూప్రాన్‌లో మూడు చోరీ కేసుల్లో అరెస్ట్.. తాళం వేసిన ఇళ్లు, షాపులే లక్ష్యంగా చోరీలు



తూప్రాన్, సందేశం టైమ్స్, ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ వి. వెంకటేశం, ఆగస్టు 23: తూప్రాన్ పట్టణంలో నమోదైన మూడు చోరీ కేసులకు సంబంధించి కందుల సత్యనారాయణ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. తూప్రాన్ ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పరిధిలో 60కిపైగా చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. విశాఖపట్నానికి చెందిన సత్యనారాయణ కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో కూలీగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పగటి సమయంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లు, దుకాణాలను గుర్తించి, రాత్రి వేళల్లో వాటిని లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఒకే ప్రాంతంలో స్థిరంగా ఉండకుండా వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. తూప్రాన్‌లో నమోదైన మూడు చోరీ కేసులకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు.



## దివ్యాంగులకు యూడీఐడీ ప్రత్యేక శిబిరం ఈనెల 25న

మెదక్ నియోజకవర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: దివ్యాంగుల కోసం మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించనున్న యూనిక్ డిసెబిలిటీ ఐడీ (యూడీఐడీ) ప్రత్యేక శిబిరం తేదీలో మార్పు చేసినట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. గతంలో ఈనెల 26వ తేదీన యూడీఐడీ శిబిరం నిర్వహించనున్నట్లు ప్రకటన జారీ చేసినప్పటికీ, ఆ రోజున మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉన్నందున శిబిరాన్ని ఈనెల 25వ తేదీ మంగళవారం మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. నూతన చేయూత పెన్షన్ల దరఖాస్తుల గడువు ఈనెల 31వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో ఇప్పటివరకు యూడీఐడీ ధ్రువీకరణ పత్రం పొందని దివ్యాంగులు ఆగస్టు 24వ తేదీ సాయంత్రం వరకు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి స్లాట్ బుకింగ్ ప్రక్రియ పూర్తిచేసి, ఆగస్టు 25న మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించే ప్రత్యేక శిబిరంలో యూడీఐడీకి సంబంధించిన ధ్రువీకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే యూడీఐడీ కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యాలయం, సంబంధిత మండల ఏపీఎంల ద్వారా శిబిరానికి సంబంధించిన సమాచారం అందజేస్తామని శ్రీనివాసరావు పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని యూడీఐడీ ధ్రువీకరణ ప్రక్రియను పూర్తిచేసుకోవాలని, తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పెన్షన్లు మరియు ఇతర ప్రయోజనాలను పొందేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.,



## చిన్నమండవ-చొప్పకట్లపాలెం రహదారి పనులకు శ్రీకారం

చింతకాని, సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్చార్జి శెట్టి సురేష్, ఆగస్టు 23: చింతకాని మండలం చిన్నమండవ నుంచి బోనకల్ మండలంలోని చొప్పకట్లపాలెం వరకు సుమారు రూ.6 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రహదారి పనులకు శనివారం శ్రీకారం చుట్టారు. రహదారి నిర్మాణంలో భాగంగా జంగిల్ క్లియరెన్స్ పనులను మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, ఉప సర్పంచ్ తంగిరాల మాధవి, ఖమ్మం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్. మడిపల్లి భాస్కర్ తదితరులు ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కృషితో రహదారి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరయ్యాయని నాయకులు తెలిపారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే చింతకాని, బోనకల్ మండలాల పరిధిలోని పలు గ్రామాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజల రోజువారీ ప్రయాణాలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా రహదారి సౌకర్యం కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఈ పనుల ప్రారంభంతో ఉపశమనం కలగనుందని, నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కూరపాటి కిషోర్, బంజర నాగార్జున, నెల్లూరు కోటేశ్వరరావు, ఆలస్యం బసవయ్య, మరీదు రామకృష్ణ, పరసగాని సతీష్, డొక్కుపర్తి గోపాలరావు, శ్యామకూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో యువతి మృతి.. మూసాపేటలో విషాదం

నర్సాపూర్, సందేశం టైమ్స్, ఆగస్టు 23: మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం మూసాపేట గ్రామంలో అనారోగ్యంతో యువతి మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన గడ్డం నరహరి– మైనమ్మ దంపతుల పెద్ద కుమార్తె విజయ గత 15 రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చికిత్స పొందుతున్న క్రమంలో ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందినట్లు పేర్కొన్నారు. యువతి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఎంతో భవిష్యత్తు ఉన్న కుమార్తె అనారోగ్యంతో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు స్థానికులను కలచివేశాయి. విజయ మృతితో గ్రామంలో విషాద వాతావరణం నెలకొనగా, కుటుంబ సభ్యులను పలువురు గ్రామస్థులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



## చిల్లర్‌లో న్యాయ అవగాహన సదస్సు

మెదక్/అల్లాదుర్గం, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: అల్లాదుర్గం మండలం చిల్లర్ గ్రామంలో సర్పంచ్ ముక్కెర శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల న్యాయ సేవా సంస్థ సహకారంతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్లాదుర్గం జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఏ. సుచరిత ముఖ్య అతిథిగా హాజరై ప్రజలకు వివిధ చట్టాలు, న్యాయ సేవలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ప్రజలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవలు, అవసరమైన సందర్భాల్లో న్యాయ సహాయం పొందే విధానం, తమ హక్కులను పరిరక్షించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అలాగే తీర్పులను ప్రత్యేక భాషల్లోకి అనువదించడం, ప్రపంచ ఆదివాసీ ప్రజల దినోత్సవం, ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం, వ్యవసాయ చట్టాలు, రైతు సంక్షేమ పథకాలు తదితర అంశాలపై వివరించారు. ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకుని అవసరమైన సమయంలో న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని న్యాయమూర్తి సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, న్యాయ సేవా సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## పోలీస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

సంగారెడ్డి, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: సంగారెడ్డి జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారంలో పోలీస్ అసోసియేషన్ కీలక పాత్ర పోషించాలని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ సూచించారు. సంగారెడ్డి జిల్లాలో పోలీస్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియను పోలీస్ సిబ్బంది పరస్పర సమన్వయంతో ఏకగ్రీవంగా పూర్తి చేశారు. జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హెడ్ కానిస్టేబుల్ ఎ. జనార్ధన్, ఉపాధ్యక్షులుగా ఇన్‌స్పెక్టర్ బి. రమేష్, ఎస్ఐ బి. నాగలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఆర్ఐ రాజశేఖర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా హెడ్ కానిస్టేబుల్ ఎం. రాజారామ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి. సంతోష్ కుమార్, ట్రెజరర్‌గా హెడ్ కానిస్టేబుల్ కూన రమేష్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందిస్తూ పదవి ఎంత గొప్పదో, దానికి సంబంధించిన బాధ్యత కూడా అంతే గొప్పగా ఉంటుందని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి హక్కులు, సంక్షేమ కార్యక్రమాల అమలుకు నూతన కార్యవర్గం చురుగ్గా పనిచేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలు, కుటుంబ సంక్షేమానికి సంబంధించిన అంశాలను సమన్వయంతో పరిష్కరించేందుకు అసోసియేషన్ కృషి చేయాలని తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఎస్పీ అభినందించి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీ సురేందర్ రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సదా నాగరాజు, పోలీస్ అసోసియేషన్ ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## రేగోడ్ ఏఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన సందేశం టైమ్స్ ప్రతినిధులు

రేగోడ్, సందేశం టైమ్స్ ప్రతినిధి, ఆగస్టు 23: రేగోడ్ మండల ఏఎస్సై పెంటయ్యను సందేశం టైమ్స్ రేగోడ్ మండల రిపోర్టర్ మంతురి రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల పరిస్థితి, డ్రంక్ అండ్ డ్రైవ్ నియంత్రణ, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీసుల పాత్ర తదితర అంశాలపై ఏఎస్సైతో చర్చించారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడం, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవడం, మద్యం సేవించి వాహనాలు నడపకుండా కఠిన చర్యలు చేపట్టడం వంటి అంశాలపై చర్చ జరిగినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖకు, ప్రజలకు మధ్య సమన్వయంతో పాటు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా బాధ్యతపై కూడా అభిప్రాయాలు పంచుకున్నారు. అనంతరం అందోల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సీహెచ్ బస్వరాజు, స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్, సబ్ ఎడిటర్ టీ. సంగమేశ్వర్, సాయి వెంకట్ తదితరులు ఏఎస్సైని కలిసి మర్యాదపూర్వకంగా మాట్లాడారు.



## నంబర్ ప్లేట్లు లేని 50 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

సూర్యాపేట, సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి, ఆగస్టు 23: సూర్యాపేట జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు లేకుండా రహదారులపై తిరుగుతున్న 50 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా వాహనాల యజమానులతో అప్పటికప్పుడే వాహనాలకు నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేయించి, ఇకపై ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా సూచనలు చేశారు. అనంతరం పట్టుబడిన వాహనదారులకు ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించి రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు, పౌరులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి వాహనానికి తప్పనిసరిగా నంబర్ ప్లేట్ ఉండాలని సూచించారు. వాహనానికి నంబర్ ప్లేట్ లేకపోతే ఏదైనా ప్రమాదం లేదా నేరం జరిగిన సమయంలో వాహనాన్ని గుర్తించడం చాలా కష్టమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలకు నంబర్ ప్లేట్లు అమర్చుకుని రహదారులపై ప్రయాణించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత, రహదారి ప్రమాదాల నియంత్రణ, నేరాల నివారణలో భాగంగా ట్రాఫిక్ పోలీసులు చేపడుతున్న ప్రత్యేక తనిఖీలకు వాహనదారులు సహకరించాలని కోరారు.



## శ్రీశైలం జలాశయానికి స్వల్పంగా పెరిగిన వరద

సూర్యాపేట, సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి, ఆగస్టు 23: శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం స్వల్పంగా పెరిగింది. ప్రస్తుతం జలాశయానికి 45,192 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 48,444 క్యూసెక్కుల నీటిని ఔట్‌ఫ్లోగా విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 166.70 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 875.70 అడుగుల నీటిమట్టం నమోదైంది. జలాశయానికి వరద ప్రవాహం స్వల్పంగా పెరగడంతో అధికారులు నీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇదిలా ఉండగా శ్రీశైలం కుడి జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయినట్లు సమాచారం. జలాశయానికి వస్తున్న వరద, నీటి నిల్వ, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో పరిస్థితులను అధికారులు నిరంతరం పరిశీలిస్తున్నారు.

## MNR యాజమాన్యం తీరుపై విద్యార్థుల ఆగ్రహం.. ఎమ్మెల్యేను ఆశ్రయించిన విద్యార్థులు, తల్లిదండ్రులు



సంగారెడ్డి, ఆగస్టు 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి): MNR విద్యాసంస్థ యాజమాన్యం తమకు అన్యాయం చేస్తోందంటూ పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను ఆశ్రయించారు. అడ్మిషన్ సమయంలో యాజమాన్యం సూచించిన విధంగానే ఫీజు చెల్లించి తమ పిల్లలను విద్యాసంస్థలో చేర్పించామని తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు వివరించారు. అయితే నెల రోజుల పాటు తరగతులు నిర్వహించిన అనంతరం విద్యార్థులు సమర్పించిన సర్టిఫికెట్లు నకిలీవని యాజమాన్యం పేర్కొంటోందని వారు ఆరోపించారు. ఈ విషయంపై యాజమాన్యాన్ని సంప్రదించేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బందితో బయటకు పంపించారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా విద్యార్థులు తిరిగి విద్యాసంస్థలో కొనసాగాలంటే మరో రూ.2 లక్షల ఫీజు చెల్లించాల్సిందేనని, లేకపోతే విద్యాసంస్థలోకి అనుమతించబోమని యాజమాన్యం చెబుతోందని వారు ఆరోపించారు. అడ్మిషన్ సమయంలో పూర్తి ఫీజు వివరాలు తెలుసుకుని యాజమాన్యం సూచించిన మేరకు ఫీజు చెల్లించిన తర్వాత మళ్లీ అదనంగా రూ.2 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేయడం సరికాదని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా న్యాయం చేయాలని కోరుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. వారి సమస్యను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే వెంటనే MNR యాజమాన్యంతో ఫోన్‌లో మాట్లాడి, ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థులకు అన్యాయం జరగకూడదని, వారి విద్యకు ఆటంకం కలగకుండా సమస్యను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ అంశంపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు సోమవారం MNR యాజమాన్యం తనను కలవాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యను పూర్తిగా పరిశీలించి వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ భరోసా కల్పించారు.



## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సంగారెడ్డి, ఆగస్టు 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డి. విద్యాసాగర్ డిమాండ్ చేశారు. రాగిజావ, గుడ్లకు సంబంధించిన నిధులను పెంచడంతో పాటు మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం కల్పించి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలను అమలు చేయాలని కోరారు. ఈ మేరకు జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ విద్యార్థులకు సేవలందిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని డి. విద్యాసాగర్ విజ్ఞప్తి చేశారు.




## నూతన ఎస్ఐ లక్ష్మీకాంత్ రెడ్డికి సందేశం టైమ్స్ ప్రతినిధుల శుభాకాంక్షలు

వట్పల్లి, ఆగస్టు 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి): వట్పల్లి మండలానికి నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మీకాంత్ రెడ్డిని సందేశం టైమ్స్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని శాంతిభద్రతలు, ప్రజా సమస్యలు, స్థానిక పరిస్థితులపై నూతన ఎస్ఐతో చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతంగా సేవలందించాలని, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సందేశం టైమ్స్ సబ్‌ఎడిటర్ టి. సంగమేశ్వర్, స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్, అందోల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ సి.హెచ్. బస్వరాజ్, రేగోడ్ మండల రిపోర్టర్ మంతురి రాజు వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## సందేశం టైమ్స్‌లో నూతన పదవి బాధ్యతలు

హైదరాబాద్, ఆగస్టు 23 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రికలో పలువురు ప్రతినిధులకు యాజమాన్యం నూతన బాధ్యతలు అప్పగించింది. గతంలో స్టేట్ కోఆర్డినేటర్‌గా సేవలందించిన టీ. సంగమేశ్వర్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సబ్‌ఎడిటర్‌గా, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేసిన బి. సంగమేశ్వర్‌ను స్టేట్ కోఆర్డినేటర్‌గా, గతంలో సంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించిన కే. సంగమేశ్వర్‌ను స్టేట్ బ్యూరోగా నియమించింది. అదేవిధంగా వట్పల్లి మండల రిపోర్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్. బస్వరాజ్‌ను ఆందోల్ నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా, ఆందోల్ మండల రిపోర్టర్‌గా సేవలందించిన వి. వెంకటేశంను ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్‌గా నియమిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన బాధ్యతలు స్వీకరించిన వారు తమపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వార్తా సేకరణ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ప్రజలకు విశ్వసనీయమైన వార్తలను అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.